## నూతన పాఠశాల ప్రారంభం



స్కూల్‌ను ప్రారంభిస్తున్న డీఈఓ విజయలక్ష్మి

మేడ్చల్: మేడ్చల్ చెక్‌పోస్ట్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంపీపీఎస్‌ను జిల్లా విద్యాధికారి విజయకుమారి శుక్రవారం ప్రారంభించారు. పేద విద్యార్థుల వద్దకు పాఠశాల ఉండాలనే ఉద్దేశంతో చెక్‌పోస్ట్‌లో స్కూల్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. చెక్‌పోస్ట్ ప్రాంతంలో కార్మికులు, వలసదారులు అధికంగా ఉండటంతో వారికోసం పాఠశాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎంఈఓ శంకరయ్య, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాశ్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా మెడిసిటీ స్నాతకోత్సవం



పట్టాలు అందుకుంటున్న మెడికోలు

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని ఘనాపూర్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, (ఎంఐఎంఎస్) మెడికల్ కళాశాల స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 2019 బ్యాచ్‌లో పట్టభద్రులైన మెడికోలకు సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆసుపత్రి సీఈఓ డాక్టర్.ఆర్.కృష్ణయ్య, మెడిసిటీ ప్రెసిడెంట్ డాక్టర్ శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ దేవేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



మేడ్చల్: మేడ్చల్ మీదుగా వెళ్తున్న 44వ జాతీయ రహదారిపై నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని, ఈ సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు ట్రాఫిక్ పోలీసులను కోరారు. శుక్రవారం సీపీఎం నాయకులు మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. జాతీయరహదారి విస్తరణ, నిర్మాణ పనులు నత్తనడకగా కొనసాగుతున్నాయన్నారు. వాటిని వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. మండల సీపీఎం కార్యదర్శి నరేష్ నాయకులు కొమురయ్య, నర్సింగ్‌రావు, వెంకటేష్, పూర్ణచంద్, ప్రశాంత్ తదితరులున్నారు.

## భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

జవహర్‌నగర్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడిని జవహర్‌నగర్ ముస్లిం కమిటీ ఖండించింది. శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ దేవేందర్‌నగర్‌లో ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ పాషామియా మాట్లాడుతూ.. ఇలాంటి దాడులను ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. షేక్ షావలి, మహ్మద్ రషీద్, మహ్మద్ సోహెల్, కమిటీ కార్యదర్శి కాలేషా, సయ్యద్, సయ్యద్ ముబషీర్, ఎండీ.గౌస్, సలావుద్దీన్, మోహిద్, జమాల్, అఫ్జల్, మహ్మద్ పాల్గొన్నారు.

## దివ్యాంగులు రూపొందించిన దియాల ప్రదర్శన

కాప్రా: అనురాగ్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో దీపావళి సందర్భంగా దివ్యాంగులచే దియాలను తయారు చేయించారు. నేడు, రేపు సైనిక్‌పురి, హెచ్‌బీఎల్ బ్రాంచ్‌లలో ప్రదర్శనలో ఉంచుతామని, స్టాల్స్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. దివ్యాంగులు స్వయంగా దీపావళి దియాలకు రంగులు, కొవ్వొత్తులు, ఫినాయిల్, పేపర్‌బ్యాగ్ ఆక్టివిటీస్‌లను ప్రదర్శించారు. రాజశేఖర్, డాక్టర్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులు పూర్తి చేయాలి

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువు (లేక్ పార్క్)కు సంబంధించి నెలలోగా పెండింగ్ పనులు పూర్తిచేయాలని హెచ్‌ఎండీఏ అధికారులను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ హెచ్చరించారు. శుక్రవారం హెచ్‌ఎండీఏ, జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అధికారుల మధ్య సమన్వయ లోపంతో జరగాల్సిన అభివృద్ధి జరగడం లేదన్నారు. పనులు సకాలంలో పూర్తి చేయకపోతే స్థానికకులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. హెచ్‌ఎండీఏ డీఈ రామారావు, జీహెచ్‌ఎంసీ ఈఈ లక్ష్మణ్, జలమండలి జీఎం సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ‘పైసా వసూల్’కు సిద్ధం !

**నిధుల లేమితో అభివృద్ధి పనులకు ఆటంకం**

- పోచారంలో వార్షిక ఆస్తిపన్ను లక్ష్యం రూ.20 కోట్లు
- నెలవారీగా ఇతరత్రా ఖర్చులకు రూ. కోటికి పైనే



పోచారం మున్సిపల్ కార్యాలయం

పోచారం: ఆస్తిపన్ను సకాలంలో రాకపోవడం, ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు విడుదల కాకపోవడంతో ఆదాయ వనరులను పెంచుకునే దిశగా పోచారం పురపాలక సంఘం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా ఇంటిపన్ను రివిజన్ చేయాలన్న ఆలోచనలో అధికారులున్నారు.

**గ్రామ పంచాయితీల విలీనంతో...**

పోచారం మున్సిపాలిటీలో సమీపంలోని కాచవాని సింగారం, ప్రతాపసింగారం, కొర్రెముల్, చౌదరిగూడ, వెంకటాపూర్ గ్రామాలను విలీనం చేశారు. దీంతో మున్సిపాలిటీ పరిధి సుమారు 80 చదరపు కిలోమీటర్ల మేరకు విస్తరించింది. పెరిగిన పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలంటే అందుకు అవసరమైన నిధులలేమి వెంటాడుతోంది. ఎల్‌ఆర్‌ఎస్, రిజిస్ట్రేషన్లు, బహుళ అంతస్తుల భవనాల అనుమతుల ద్వారా వచ్చే ఆదాయం అందకపోవడంతో అభివృద్ధి పనులు అటకెక్కాయి.

**పెరిగిన సిబ్బంది జీతభత్యాలు..**

విలీన గ్రామాల్లో పనిచేస్తున్న సిబ్బంది మున్సిపాలిటీలో చేరడంతో వీరి జీతాలు పెంచక తప్పడం లేదు. గతంలో గ్రామ పంచాయతీలు నిర్ధారించిన ఆస్తిపన్నును రివిజన్ చేస్తేగానీ, పెంచిన జీతాల చెల్లింపులతో పాటు అభివృద్ధి పనులు చేపట్టలేమని మున్సిపల్ అధికార యంత్రాంగం ఆలోచన చేస్తోంది.

**నివాసేతర భవనాల లెక్కల సేకరణ..**

రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి అనుమతి తీసుకుని వాణిజ్యపరంగా వినియోగిస్తున్న భవనాల లెక్కలు తీస్తున్నారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి దుకాణాలు, బ్యాంకులు, హాస్టళ్లు, హోటళ్లు, రెస్ట్ రూమ్‌లు, విద్యాసంస్థలు, గోడౌన్లు, సెల్‌టవర్లు, బార్లు, రెస్టారెంట్లు, విద్యాసంస్థలు, థియేటర్లు, ఆఫీసులు, పెట్రోల్‌బంకులు, ఫంక్షన్‌హాళ్లు, బ్యాంకెట్లు, మినీ థియేటర్లు, షెడ్లు, ఏటీఎంలు, రియల్ ఎస్టేట్ ఆఫీసులు, ఫిల్టర్ వాటర్ యూనిట్లు, ఆసుపత్రులు, జిమ్స్, ఫ్యాక్టరీల ట్యాక్స్ వివరాలు సేకరించనున్నారు. వ్యాపార సంస్థల వద్ద ఫీజు వసూలు చేసి ట్రేడ్ లైసెన్స్ జారీ విధానాన్ని వేగవంతం చేయాలని భావిస్తున్నారు.

**లక్షకు చేరుకున్న జనాభా...**

పోచారం మున్సిపాలిటీ పరిధిలో జనాభా సుమారు లక్షకు చేరింది. ఇందులో 65 వేలమంది ఓటర్లు ఉంటారు. వీరికి కావాల్సిన మౌలిక వసతులను మున్సిపాలిటీ కల్పించాలంటే ఆదాయ వనరులు ఉండాలి. అందుకే మున్సిపాలిటీల అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఆదాయం పెరిగితే అభివృద్ధి సాధ్యం**



ప్రస్తుతం ఉన్న ఆదాయం నుంచి చిన్నపాటి అభివృద్ధి పనులు చేపట్టగలుగుతున్నాం. పెద్ద మొత్తంలో రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులు కల్పించాలంటే ఆదాయ వనరులు పెరగాలి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతేనే ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరుగుతుంది. ఆ దిశగా కృషి చేస్తున్నాం.

– నిత్యానంద్, కమిషనర్ పోచారం

# ‘బీసీలకు రిజర్వేషన్ అందకుండా కుట్ర’



మేడ్చల్‌లో రాస్తారోకో చేస్తున్న బీసీ విద్యార్థి సంఘాల నేతలు

మేడ్చల్: బీసీలకు రిజర్వేషన్లు అందకుండా అగ్రవర్ణాల నేతలు కుట్రలు పన్నుతున్నారని బీసీ విద్యార్థి సంఘాల కేంద్ర కమిటీ సభ్యుడు అరుణ్‌యాదవ్ ఆరోపించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించడంపై హైకోర్టు స్టే విధించడంతో మేడ్చల్ పట్టణంలో 44వ జాతీయ రహదారిపై విద్యార్థులతో కలిసి బీసీ విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రిజర్వేషన్ల సాధనకు విద్యార్థి సంఘాలు చేపట్టిన పోరాటం ఆగదని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. బీసీ విద్యార్థి సంఘాల నేతలతో పాటు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్క్ అభివృద్ధికి స్థల పరిశీలన



పార్క్ స్థలాన్ని పరిశీలిస్తున్న స్థానిక నేతలు

మేడ్చల్: పట్టణంలో పార్కు అభివృద్ధికి అధికారులతో కలిసి కాంగ్రెస్ నేతలు కేఎల్‌ఆర్ విజయానగర్‌లో స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం కేఎల్‌ఆర్ ఫేజ్–2లో ఎకరం స్థలంలో పార్కుతో పాటు ఓపెన్ జిమ్, వాకింగ్‌ట్రాక్, ఆటస్థలం ఏర్పాటు చేయాలని మున్సిపాలిటీ ప్రతిపాదనలు పంపడంతో హెచ్‌ఎండీఏ రూ. కోటి మంజూరు చేసిందని అధికారులు తెలిపారు. స్థల పరిశీలనలో అధికారులతో పాటు కాంగ్రెస్, వివిధ పార్టీల నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, గాంధీ, సత్యనారాయణ, శ్రీరాములు, విజయ్‌సింగ్, వెంకట్‌రెడ్డి, చక్రపాణి తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తా



ప్రమాద బీమా బాండ్ల పంపిణీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

కాప్రా: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కాప్రా ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో చేపట్టిన వ్యక్తిగత ప్రమాదబీమా బాండ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలన్నారు. వార్త సేకరణలో పాత్రికేయులు తమ ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా బాధ్యతలు నిర్వహిస్తూ సమాజానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారన్నారు. విలువలతో కూడిన జర్నలిస్టులకు ఎప్పుడూ.. గుర్తింపు ఉంటుందన్నారు.

**ప్రెస్‌క్లబ్ సభ్యులకు ప్రమాద బీమా..**

ప్రెస్‌క్లబ్ సభ్యులకు వ్యక్తిగత ప్రమాదబీమాను పాండాల శివకుమార్‌గౌడ్ చేయించారు. జర్నలిస్టుల సంక్షేమ నిధికి సహకారం అందించిన మాజీ కార్పొరేటర్ పావనీమణిపాల్‌రెడ్డి, వంజరి ప్రవీణ్, రాఘవరెడ్డి, బండే గౌడలను ఆయన అభినందించారు. సీనియర్ జర్నలిస్టులు వెంకట్‌రెడ్డి, మల్కయ్య, శ్రీనివాస్‌గౌడ్, కేసీ మోహన్, సత్యనారాయణ, సహదేవచారి, జ్యోతిర్మయచారి, చంద్రమౌళి, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, కోశాధికారి నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**స్థానిక సమస్యలపై పాదయాత్ర..**

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, ద్వారకపురి కాలనీలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా గుతుకుల రోడ్లతో పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. వర్షం పడితే రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన మాట్లాడుతూ.. నెలరోజుల్లో ద్వారకపురికాలనీ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సీసీఎస్ ప్రతినిధి ఎంపల్లి పద్మారెడ్డి, కాలనీవాసులు శివశంకర్‌రెడ్డి, సుబ్బారావు, దేవేందర్, శివసాయి, చంద్రకళ, నవిత తదితరులు పాల్గొన్నారు.

## పదోతరగతి పరీక్షా పత్రాలు వేలం !

**డీఈఓ విజయకుమారి**

సాక్షి,మేడ్చల్‌జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు సంబంధించిన పదోతరగతి మార్చి /జూన్ 2023–24 ప్రభుత్వ పరీక్షా (ఫస్ట్,సెకండ్ సెట్) పత్రాలు వేలం వేయనున్నట్లు విద్యాశాఖ అధికారి విజయకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష పత్రాల వేలంలో పాల్గొనే జిల్లాలోని రద్దీ వ్యాపారులు రూ.10 వేలు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా విద్యాశాఖాధికారి పేరున డిమాండ్ డ్రాఫ్ట్ తీసి వారి వారి రేట్ల వివరాలతో పాటు సీల్డ్ కొటేషన్‌ను కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో 13న సాయంత్ర 3 లోగా సమర్పించాలని కోరారు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు టెండర్లు ఓపెన్ చేయబడతాయన్నారు.

## పనిచేసే చోట అనారోగ్యానికి గురై..

**మేస్త్రి మృతి**

ఘట్‌కేసర్: భవన నిర్మాణ పనులకు వెళ్లిన ఓ మేస్త్రి మృతి చెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం .. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన శ్రీపతి కనకయ్య (45) కీసర మండలం శ్రీనివాస్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా శుక్రవారం ఉదయం తోటి కార్మికులతో కలిసి ఘనాపూర్‌లోని ఓ వెంచర్‌లో సత్యనారాయణ మేస్త్రి దగ్గర పనిచేయడానికి వెళ్లాడు. పనిచేస్తుండగా ఉదయం 11 గంటల ప్రాంతంలో అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే తోటి కార్మికులు 108కు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న కీసర ఆర్డీఓ వెంకటఉపేందర్‌రెడ్డి



శామీర్‌పేట్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కీసర: డివిజన్ పరిధిలోని కీసర తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం –2005 పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య దేశంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ప్రతి పౌరుడు తనకు కావాల్సిన సమాచారాన్ని స్వేచ్ఛగా పొందేందుకు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రజలందరూ ఈ చట్టంపై అవగాహన పెంపొందించుకుని, దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో కళాకారులు సమాచారహక్కు చట్టంపై సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. కీసర తహసీల్దార్ అశోక్ కుమార్ సమాచార హక్కు కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఘనంగా వారోత్సవాలు..**

మేడ్చల్: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సమాచార హక్కు చట్టం వారోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వారోత్సవాలను మేడ్చల్, శామీర్‌పేట్, మూడు చింతలపల్లి, కీసర, ఘట్‌కేసర్ మండలాల్లో నిర్వహించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. అధికారులు, మహిళలు కలిసి ర్యాలీలు నిర్వహించారు. మహిళా సంఘాల సీసీలు, వీఓఏలు ఐబీ సభ్యులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు.

## శామీర్‌పేట చెరువు సందర్శన



శామీర్‌పేట్ చెరువులో తనిఖీలు నిర్వహిస్తున్న రోయింగ్ స్పోర్ట్స్ అథారిటీ అధికారులు

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా, తూంకుంట మున్సిపాలిటీ, శామీర్‌పేట పెద్దచెరువును తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ సభ్యులు శుక్రవారం సందర్శించారు. ఇంటర్నేషనల్ రోయింగ్ చాంపియన్‌షిప్ –2026 నిర్వహించాలని నిర్ణయించింది. కాగా రోయింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాలతో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్, పలువురు అధికారులు శామీర్‌పేట చెరువును సందర్శించారు. తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్, ఫైర్ సిబ్బంది, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ప్రతినిధులు ఇస్మాయిల్ బేగ్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత




నాగారం ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు

కీసర: సైన్స్ ఫెయిర్‌తో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని కీసర మండల విద్యాధికారి జమదగ్ని అన్నారు. శుక్రవారం నాగారం ప్రభుత్వ పాఠశాలలో ఆగస్త్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. మండల విద్యాధికారి జమదగ్ని, చీర్యాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ హాజరై విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను వీక్షించారు. సైనికులకు చలికాలంలో వేడిగా ఉండే సోలార్ ప్యానెల్ కోట్లు, ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యాన్ని ఫిల్టర్ చేసే నమూనాలు ఆకట్టుకున్నాయి. ఫౌండేషన్ సభ్యులు త్రివేణి, అఫ్షాన్, ఉపాధ్యాయులు రమా సత్యశ్రీ, కమల, అర్చన, సంధ్యారాణి, వందన, రాజ్యలక్ష్మి, అరవింద్‌కుమార్, రఘు, శ్రీదేవి, అజీజ్ అహ్మద్, పద్మ, గాయత్రి, వరమ్మ, సంజయ్‌రాణి, పాండురంగారెడ్డి, సుప్రజ, వాలంటీర్ స్వప్న, పావని, పవిత్ర పాల్గొన్నారు.

# అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు !

- పట్టించుకోని సంబంధిత అధికారులు
- నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలకు డిమాండ్



కుషాయిగూడ: కాప్రా మండలం, కుషాయిగూడ సర్వేనెంబరు 376లోని అసైన్డ్ భూమిని కబ్జాచేసి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఏకంగా రూ.50 కోట్లు విలువ చేసే స్థలం అన్యాక్రాంతమవుతున్నా.. అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. కోట్లాది రూపాయాల విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతుంటే రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

☛ కుషాయిగూడ, జమ్మిగడ్డ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 376లో సుమారు 16 ఎకరాల అసైన్డ్ భూమి ఉన్నట్లు సమాచారం. ఈ కబ్జా బాగోతాన్ని గమనించిన సీసీఎస్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్, డీఆర్‌ఓ, ఆర్‌డీఓలతో పాటుగా జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి వచ్చింది.

**అక్రమ నిర్మాణాలను పరిశీలించిన తహసీల్దార్..**

ఈ విషయంపై అడిషనల్ కలెక్టర్ ఆర్‌డీఓకు ఆదేశాలివ్వడంతో శుక్రవారం సాయంత్రం హుటాహుటీన కాప్రా తహసీల్దార్ సుచరిత సిబ్బందితో కలిసి జమ్మిగడ్డలోని అసైన్డ్ భూముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలను సందర్శించారు. వెంటనే నిర్మాణ పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు. సర్వే నెంబరు 376లో ఎలాంటి అనుమతులు ఇవ్వకూడదని, ఇప్పటికే జీహెచ్‌ఎంసీ అధికారులకు 22–ఏ అందజేసినట్లు ఆమె పేర్కొనడం గమనార్హం.

**కఠిన చర్యలు తీసుకోవాలి..**

కోట్లాది రూపాయాల విలువ చేసే ప్రభుత్వ భూమిని పరిరక్షించడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన రెవెన్యూ, కాప్రా టౌన్‌ప్లానింగ్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీసీఎస్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

**అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు**

కాప్రా: కుషాయిగూడలో అసైన్డ్ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా తహసీల్దార్ సుచరిత స్పష్టం చేశారు. శుక్రవారం కుషాయిగూడ జమ్మిగడ్డ అసైన్డ్ భూముల్లో వెలిసిన నిర్మాణాలపై అందిన ఫిర్యాదు మేరకు ఆమె పర్యటించారు. తక్షణమే అక్రమ నిర్మాణాలను తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# చిన్నారుల ఎదుగుదలే లక్ష్యం

- అంగన్‌వాడీలో ప్రత్యేక కార్యాచరణకు చర్యలు
- విద్యాబోధన, పౌష్టికాహారంపై దృష్టి

సాక్షి,మేడ్చల్ జిల్లా: చిన్నారుల మానసిక, శారీరక వికాసానికి, పూర్వ ప్రాథమిక విద్య బోధనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. దీనిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఒకపూట సంపూర్ణ భోజనం అందించడమే కాకుండా వారిలో తలెత్తే పోషకాహారలోపాన్ని పారదోలేందుకు కసరత్తు చేస్తుంది.

**ఆటపాటలతో విద్యా బోధన..**

గ్రేటర్ సహా మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో 3,307 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో మొత్తం లబ్ధిదారులు 3.75 లక్షల మంది ఉన్నారు. వీరందరూ ప్రతిరోజు పౌష్టికాహారం పొందుతున్నారు. ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను సిబ్బంది నేర్పిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు సైతం పౌష్టికాహారంపై తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తున్నారు. అప్పుడే పుట్టే బిడ్డలు, నవజాత శిశువులు ఆరోగ్యంగా ఉంటారని సూచిస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌తో సహా మేడ్చల్–మల్కాజిగిరి ,రంగారెడ్డి జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు లబ్ధిదారుల సంఖ్య ఈ విధంగా ఉంది.

| జిల్లా | లబ్ధిదారులు | కేంద్రాలు |
|---|---|---|
| మేడ్చల్–మల్కాజిగిరి | 1,27,401 | 703 |
| హైదరాబాద్ | 1,19,800 | 914 |
| రంగారెడ్డి | 1,28,797 | 1600 |
| మొత్తం | 3,75,998 | 3,217 |

**పౌష్టికాహారంపై అవగాహన..**

చిన్నారుల్లో తలెత్తే అనారోగ్య సమస్యలు, ఎదుగుదలలో లోపాలు పోషకాహార లేమి వల్లే సంభవిస్తున్నాయి. బాల్యంలో సరైన ఆహారాన్ని అందించకపోతే ఎదురయ్యే ఇబ్బందులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. పిల్లల కోసం ఇళ్లలోనే స్వయంగా బలవర్ధక ఆహారాన్ని ఎలా తయారుచేయాలో ప్రదర్శనల్లో వివరిస్తున్నారు. పల్లిపట్టీలు, నువ్వుల లడ్డూలు, రాగి జావ వంటివి తినిపించాలని సూచిస్తున్నారు.

**రక్తహీనత నివారణ**

పేదరికంతో సరైన పౌష్టికాహారం తినిపించకపోవడం వల్ల చిన్నారుల్లో రక్తహీనత, తీవ్ర పోషణ లోపం తలెత్తుతోందని ఇటీవల పరీక్షల్లో గుర్తించారు. ఈ సమస్య ఎదుర్కొంటున్న చిన్నారులకు అదనంగా పౌష్టికాహారం అందిస్తున్నారు. బాలామృతం ప్లస్‌ను ఇస్తున్నారు. వీటివల్ల పిల్లల ఎదుగుదల మెరుగుపడటంతో పాటు ఆరోగ్యంగా ఉంటారు.

**శుభ్రతతో ఆరోగ్యం..**

చేతివేళ్లు నోట్లో పెట్టుకోవడం, అపరిశుభ్రత కారణంగా చిన్నారులు తరచూ వ్యాధుల బారినపడుతున్నారు. శుభ్రత పాటించేలా కేంద్రాల్లో ప్రత్యేక పాఠాన్ని బోధిస్తున్నారు. చేతులు ఎలా శుభ్రం చేసుకోవాలి.. దీనివల్ల కలిగే ప్రయోజనాలను పాట రూపంలో బాలలకు వివరిస్తున్నారు. తల్లిదండ్రులకు ఈ అంశంపై అవగాహన కల్పిస్తున్నారు. పోషణ లోపం కలిగిన చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. గర్భిణిగా ఉన్న సమయం నుంచి పుట్టిన బిడ్డకు రెండేళ్లు వచ్చేంత వరకు దీన్ని కొనసాగిస్తున్నారు. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారాన్ని అందిస్తూ.. ఆరోగ్య సంరక్షణకు సూచనలు చేస్తున్నారు.